ఉపాధికి భరోసా

- పరిశ్రమల ఏర్పాటుతో తగ్గిన వలసలు
- కియా అనుబంధ సంస్థల్లో 2 వేల మందికిపైగానే చిలమత్తూరు వాసులు
- బెంగళూరు కన్నా బెస్టే అంటున్న నిరుద్యోగులు
- రవాణా సౌకర్యం కల్పించడంపై హర్షం

చిలమత్తూరు: ఉపాధి కోసం గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు అధిక సంఖ్యలో బెంగళూరుకు వలస వెళ్లి జీవనం సాగించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. బెంగళూరు కంటే మెరుగ్గా జీతాలు అందించే పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో నిరుద్యోగ యువత స్థానికంగానే ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

కియా అనుబంధ సంస్థల ఏర్పాటు

పెనుకొండ పరిధిలో కియా సంస్థ ఏర్పాటు కావడంతో చిలమత్తూరు మండల సరిహద్దు వరకు కియా అనుబంధ సంస్థలు ఏర్పాటయ్యాయి. కియా కోసం విడిభాగాల తయారీ పరిశ్రమలు 44వ నంబరు జాతీయ రహదారి పాలసముద్రం సమీపంలో ఏర్పాటు చేశారు. దీంతో వేలాది మందికి ఉపాధి లభిస్తోంది.

తప్పిన రవాణా ఇబ్బంది

చిలమత్తూరు మండలంలోని చాలా గ్రామాల ప్రజలు అక్కడికి వెళ్లి పనిచేయాలంటే గతంలో రవాణా ఇబ్బందులు ఉండేవి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగులకు రవాణా కల్పించేలా చర్యలు తీసుకొంది. అప్పటి నుంచి మండలంలో షిప్టుల వారీగా సుమారు 2 వేల మందికి పైగా కియా పరిశ్రమల్లో ఉద్యోగాల్లో చేరారు. దీంతో ఉదయం, సాయంత్రం సదరు సంస్థలు బస్సుల ద్వారా ఉద్యోగులను పనిచేసే ప్రాంతాల వద్దకే తరలిస్తున్నాయి.


పాలసముద్రం సమీపంలో ఏర్పాటైన ఎస్‌ఎల్‌ఏపీ పరిశ్రమ

రూ.18 వేలకు పైగానే...

మండలంలోని వీరాపురం, వెంకటాపురం, లక్ష్మీపురం, చిలమత్తూరు, చిన్నన్నపల్లి, దేమకేతేపల్లి, కోడూరు, శెట్టిపల్లి, చాగలేరు, పలగలపల్లి తదితర గ్రామాల నుంచి కియా అనుబంధ సంస్థల్లో దాదాపు రెండు వేల మంది పనిచేస్తున్నారు. ఒక్కొక్కరూ నెలకు రూ.18 వేల వరకూ సంపాదిస్తున్నారు. ఓటీ (ఓవర్ టైం) ద్వారా కొందరు రూ.25 వేల వరకూ సంపాదిస్తూ జీవనం సాగిస్తున్నారు. రవాణా సౌకర్యం ఉండటంతో ఓవర్ టైం చేసేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారు. సాయంత్రం అయ్యే సరికి తమ స్వస్థలాలకు చేరుకుంటుండటంతో తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన వలసలు

పాలసముద్రం వద్ద ఎస్‌ఎల్‌ఏపీ, డీఎస్‌సీ, మరో కొన్ని పరిశ్రమలను ఏర్పాటు చేశారు. పారిశ్రామికంగా శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాబోవు రోజుల్లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పరిశ్రమల ఏర్పాటుతో ఇప్పటికే వలసలు తగ్గిపోగా, స్థానికంగానే ఉద్యోగాలు కల్పించడంపై అన్ని వర్గాల వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు ముఖ్యంగా మహిళల ఆర్థిక ప్రగతి సాధించేలా గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పరిశ్రమల స్థాపనకు భూముల కేటాయింపు ముఖ్యం కాగా, ఇప్పటికే ఏపీఐఐసీ వేలాది ఎకరాలు సేకరించడంతో కేటాయింపు కూడా సులభతరం కానుంది.

ఏ ఇబ్బందీ లేదు



కియా అనుబంధ సంస్థ డీఎస్‌సీలో షీట్ ఫ్రేమ్ తయారీలో పని చేస్తున్నా. బస్సు సౌకర్యం ఉండటంతో ఏ ఇబ్బంది లేకుండా ఉద్యోగం చేసుకుంటున్నా. స్థానికంగానే ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. ఉద్యోగం షిఫ్టుల వారీగా ఉంటోంది. ఏ సమయమైనా సరే బస్సు అందుబాటులో ఉంటుంది

– గంగరాజు, వెంకటాపురం, చిలమత్తూరు

నెలకు రూ.20 వేల వరకూ...



డిగ్రీ పూర్తి చేసిన తర్వాత బెంగళూరు వెళ్లాలనుకున్నాను. అయితే కియాతో పాటుగా అనుబంధ కంపెనీలు పాలసముద్రం దగ్గర స్థాపించడంతో ఉద్యోగంలో చేరాను. బెంగళూరు కంటే ఇక్కడే బాగుండటంతో ఉద్యోగం కొనసాగిస్తున్నాను. రూ. 20 వేల వరకూ జీతం వస్తోంది. ఓవర్ టైం చేస్తే మరో రూ. 3 వేలు అదనంగా వస్తోంది.

– శంకర్, వెంకటాపురం

రోబో ఆపరేటర్‌గా చేస్తున్నా..



డీఎస్‌సీలో రోబో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. ఎక్కడో బెంగళూరు వలస వెళ్లి ఉద్యోగం చేసే దుస్థితి నేడు లేదు. దగ్గర్లోనే ఉద్యోగం, ఇంట్లో తల్లిదండ్రులతో సంతోషంగా గడిపే అవకాశం దక్కింది. కష్టం సహజం కానీ... ఉద్యోగం మాత్రం ఇష్టంతో చేస్తున్నా...

– గంగాధర్, వీరాపురం పంచాయతీ

మరిన్ని ఏర్పాటు చేయాలి



కియా అనుబంధ కంపెనీలో పనిచేస్తున్నాను. మా ఊరికి నేను పనిచేసే కంపెనీ 25 కి.మీ దూరంలో ఉంది. రవాణా కూడా కల్పించారు. చిలమత్తూరు మండలంలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని తెలిసింది. అవి ఏర్పాటైతే నాలాంటి యువతకు మేలు చేకూర్చినట్లవుతుంది.

– శేషాద్రి, చిలమత్తూరు మండలం

క్లుప్తంగా

కరాటే బెల్ట్ పరీక్షల్లో ప్రతిభ


బెల్ట్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో పలువురు విద్యార్థులు తమ ప్రతిభ చాటినట్లు రామచంద్ర తెలిపారు. ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్ష పోటీల్లో 20 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ఎల్లో, ఆరెంజ్, గ్రీన్‌బ్లూ, పర్పుల్, బ్రౌన్‌బెల్ట్‌లను సాధించారన్నారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు.

రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో దర్శనమిస్తున్న రంగనాథస్వామి

సోమందేపల్లి: మండలంలోని సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి పూజలు చేశారు. ప్రాకారోత్సవం, బ్రాహ్మణ సంతర్పణ తదితర పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

జలధి ఉత్సవానికి మారెమ్మ


వలసలో మారెమ్మదేవిని జలధి ఉత్సవానికి తరలిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని వలస గ్రామంలో వెలసిన మారెమ్మదేవిని ఆదివారం సాయంత్రం జలధి ఉత్సవానికి భక్తులు తీసుకెళ్లారు. ఆలయం నుంచి గ్రామ వీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా స్థానిక చెరువు సమీపంలో ఉన్న వంక వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పావగడ: ఎలాంటి తప్పు చేయని తన కుమారుడు చిరంజీవిని వైఎన్ హొసకోట ఎస్‌ఐ అర్జున్‌గౌడ గొడ్డును బాదినట్లు బాదారని కే రాంపురం గ్రామానికి చెందిన ముసలన్న ఆరోపించారు. తన కుమారుడినే కాకుండా గ్రామంలోని గుణశేఖర్, మంజునాథ్, అనిల్‌కుమార్ సూలనాయకనహళ్లికి చెందిన మారుతీష్‌ను సైతం లాఠీతో చావబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం దొడ్డహళ్లి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఆ గ్రామానికి చెందిన వారు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో పక్కకు జరగాలని కోరడంతో తమపైకి ఎగబాకి దాడి చేశారన్నారు. ఆ గ్రామానికి చెందిన పలువురు మహిళలు సైతం తమపై దాడికి దిగారన్నారు. అనంతరం వైఎన్ హొసకోట పీఎస్‌లో తమపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు తమను శనివారం పిలుచుకుపోయారన్నారు. ఆదేరోజు అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఎస్‌ఐ అర్జున్‌గౌడతో పాటు పోలీసు సిబ్బంది తమను లాఠీలతో కొట్టారని, పోలీసులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'వాత్సల్యం'కు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభాగ్యులపై వాత్సల్యం పథకం కింద అందించే ఆర్థిక సాయానికి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్ సుజాత ఒక ప్రకటనలో సూచించారు. వాత్సల్యం కింద ప్రతి నెలా చిన్నారులకు విద్య, వైద్య అవసరాలు తీర్చేందుకు రూ. 4 వేలు సాయం అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సీడీపీఓ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

నూతన కమిటీ ఎంపిక

సోమందేపల్లి: ఆల్ ఇండియా బంజారా సేవా సమితి మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు అంజి నాయక్ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మండల స్థాయి సర్వ సభ్య సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా వెంకటేష్ నాయక్, ఉపాధ్యక్షుడిగా చంద్ర నాయక్, శ్రీకాంత్, విజయ నాయక్, ప్రధాన కార్యదర్శిగా విక్రాంత్ నాయక్‌లను ఎన్నుకున్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం పంచాయతీ హుస్సేన్‌పురంలో శనివారం అర్ధరాత్రి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

గోరంట్ల: స్థానిక ఎస్‌ఎల్‌వీ ఫంక్షన్ హాల్ సమీపంలో కదిరి – హిందూపురం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోరంట్లకు చెందిన చంద్రప్ప అనే వ్యక్తి గాయపడ్డారు. పోలీసుల వివరాలమేరకు.. చంద్రప్ప మరో వ్యక్తితో కలసి ద్విచక్ర వాహనంలో గుమ్మయ్యగారిపల్లి నుంచి గోరంట్ల వైపు వెళ్తున్నారు. అయితే గోరంట్ల వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో వెనుక వైపు కూర్చున్న చంద్రప్ప గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం చంద్రప్పను 108 వాహనంలో హిందూపురం తరలించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పెనుకొండ: నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 11,350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ విధించడంతో పాటు ఎలాంటి లోటుపాట్లు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

49 కేంద్రాల్లో పరీక్షలు

పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 117 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 74 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో భాగంగానే మొత్తం 11,350 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 40 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష పర్యవేక్షణ నిమిత్తం 49 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 49 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 12 మంది కస్టోడియన్స్, మరో 12 మంది సహ కస్టోడియన్లను పరీక్షల కోసం ప్రత్యేకంగా నియమించారు.

అరగంట ముందే చేరుకోండి

మడకశిర: మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 3,154 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మడకశిరలోని 7 కేంద్రాల్లో 1,106, అమరాపురంలోని 3 కేంద్రాల్లో 671, గుడిబండలోని 3 కేంద్రాల్లో 540, అగళిలోని 2 కేంద్రాల్లో 366, రొళ్లలోని 2 కేంద్రాల్లో 471 మంది చొప్పున పరీక్షలు రాయనున్నారు. స్థానిక ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ పరీక్షలను నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

తప్పులకు తావివ్వొద్దు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో మూడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సత్యనరాయణ తెలిపారు. ఆదివారం అమరాపురం ఉన్నత పాఠశాల, శ్రీ సాయివిద్యానికేతన్ పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలో ఆయా సీఎస్, డీఓలు, రూమ్ సూపర్‌వైజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్‌లు నాగేంద్రకుమార్, విశ్వనాథ్, తిమ్మప్ప, డీఓలు దాదపీర్, చలపతి, గణేష్ ఇన్విజిలేటర్లతో వారు మాట్లాడారు. పరీక్ష జరిగే సమయంలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఏదైనా జరిగితే రూం సూపర్‌వైజర్‌దే బాధ్యతన్నారు.


మడకశిరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

హిందూపురం టౌన్: 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బస్‌పాస్‌తో సంబంధం లేకుండా కేవలం హాల్ టికెట్‌తోనే వారి నివాస స్థలం నుంచి పరీక్ష కేంద్రానికి ఆర్టీసీ బస్సులో వచ్చిపోవచ్చారు

అన్ని సౌకర్యాలు కల్పించాం

గోరంట్ల: పదోతరగతి పబ్లిక్ పరీక్షల కోసం మండల కేంద్రంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి గోపాల్‌నాయక్ తెలిపారు. మొత్తం 1421 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

పరిగిలో 710 మంది...

పరిగి: మండలంలో పదో తరగతి పరీక్ష కోసం మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ లక్ష్మీదేవి తెలిపారు. మండలంలో వివిధ పాఠశాలలకు చెందిన 710 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరిగి, సేవా మందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, పరిగి అమర్ విద్యామందిరం పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

గుడిబండ: నేటి నుంచి జరగనున్న పదో పరీక్షల నిమిత్తం మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండలంలో 540 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

రొళ్లలో రెండు కేంద్రాలు

రొళ్ల: మండలంలో పదో తరగతి పరీక్షల నిమిత్తం రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. రొళ్ల జెడ్పీహెచ్‌ఎస్ ఏ సెంటర్లలో 237 మంది, కేజీబీవీ ఆవినకుంట బీ సెంటర్‌లో 233 మంది విద్యార్థులు మొత్తం 470 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

పక్కాగా ఏర్పాట్లు

పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో 10 తరగతి పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేశాము. డివిజన్ పరిధిలో 11,350 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. విద్యార్థులు నిర్దేశించిన సమయానికంటే ముందుగానే హాల్ టికెట్‌లతో కేంద్రాలకు చేరుకోవాలి. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తాము

– రంగస్వామి, డీవైఈఓ, పెనుకొండ

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, కుంకుమార్చన, అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. పాలబావి వద్దకు మేళతాళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి పూజలు చేశారు. పాలబావిలోని గంగా జలంతో విగ్రహాన్ని శుద్ధి చేసిన అనంతరం పూజలు నిర్వహిస్తే సంతాన భాగ్యం లేని వారికి సంతాన భాగ్యం, పెళ్లికాని యువతులకు వివాహాలు జగురుతాయని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వ్యాధులు నయం అవుతాయని భక్తుల నమ్మకం. బ్రహ్మోత్సవం మొదటి రోజు కావడంతో చుట్టు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేడు బ్రహ్మరథోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు, రాజవంశీకుడు రంగప్పరాజు (దొర) ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

పూర్వ విద్యార్థుల సహకారం మరువలేం


అట్టలను అందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు

పరిగి: పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు మరువలేనివని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపల్ ఎన్వీ మురళీధర్‌బాబు అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు రిటైర్డ్ సైంటిస్ట్ లక్ష్మీకాంతం, కియా పరిశ్రమ కాంట్రాక్టర్ సురేష్ సమకూర్చిన రైటింగ్ ప్యాడ్‌లను పదో తరగతి విద్యార్థులకు అందించారు.

చేనేత కార్మిక సంఘం నూతన కమిటీ ఎంపిక

సోమందేపల్లి : చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు సమక్షంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా చాంద్‌బాషా, ఉపాధ్యక్షుడిగా గోవిందప్పతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని రామాంజనేయులు సూచించారు.

బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక


సమావేశమైన బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

హిందూపురం: పట్టణంలోని టీచర్‌కాలనీలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సమావేశం జరిగింది. సేవా సంఘ సమాఖ్య అనుబంధంగా జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.వరప్రసాదరావు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా దేశాయ్ మురళీ, ప్రధాన కార్యదర్శిగా పరిగి ప్రవీణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. మిగిలిన కార్యవర సభ్యులను త్వరలో ప్రకటిస్తామని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొటిపి నాగేశ్వరావు, దేమకేతేపల్లి రామ్మూర్తి, రాష్ట్ర మహిళా విభాగ్ కార్యదర్శి చుండుపల్లి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


హిందూపురంలో మట్టలతో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

హిందూపురం టౌన్: క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చి సభ్యులు పట్టణ పురవీధుల్లో ఆదివారం ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. దేశ, రాష్ట్ర, హిందూపురం ప్రజలు క్షేమం, శాంతి కోసం ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ స్టీఫన్ రాజ్, సెక్రటరీ నాగేంద్ర కుమార్, ట్రెజరర్ ఆదర్శ్ కుమార్, జాయింట్ సెక్రటరీ క్రిస్టఫర్, జాయింట్ ట్రెజరర్ ఆనంద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో ఆదివారం మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మట్టలను చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.